# తిరగబడిన చరిత్ర

ఖరీదైన మెత్తటి బెడ్‌మీద సీతాపతి!

అంతకంటే మృదువైన కోమలి సీతాపతి బాహువుల్లో సుతారంగా నలిగిపోతోంది.

ఎ.సి.గది కావటంతో చల్లటి స్పర్శ వారికి తగలకూడదనే వుద్దేశంతో ఒకరికొకరు హత్తుకుపోతున్నారు. తన్మయత్వంలో మునిగిపోతున్నారు.

కోమలి కిరాయిమనిషికాదు. పాతికేళ్ళ జవ్వని! సీతాపతి వయస్సు ఆమెకు రెట్టింపు వుంటుంది. అయినా మాంఛి రసికుడు!

డబ్బు...హోదా...అంతస్తు...పలుకుబడి అన్నీ వున్న హైక్లాస్ సొసైటీ మనిషి సీతాపతి.

'పతి అండ్ పతి' కాటన్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్స్‌లో ఒకడు.

టెలిఫోన్ మోగింది.

కోమలి పన్నగ వయ్యాలిగింది.

నొసలు ఎగ్గించి పక్కకు వత్తిగిలి చెయ్యిచాచి రిసీవర్ అందుకున్నాడు.

కోమలి చెక్కిలి మృదువుగా నిమురుతూ 'హలో...' అన్నాడు.

అవతలి వేపునుండి వెంటనే రెస్పాన్స్‌లేకపోవటంతో 'హూ ఈజిట్...?' అని ప్రశ్నించేడు.

"రిసీవర్ పెట్టేయ్ డియర్...వేళాపాళాలేకుండా ఎవడో ఇడియట్ ఫోన్చేసి ఉంటాడు..." సీతాపతి ఛాతీమీద సగం నెరసిన వెంట్రుకలను మునివేళ్ళతో గోముగా నిమురుతూ అంది కోమలి.

"ఆ...సీతాపతినే!...యస్!!.. ఎవరు? గోవిందరావా...మీ పేరెప్పుడూ విన్నట్టులేదే...?"

"ఎవరో కోన్నిస్కాగాడు. రిసీవర్ పెట్టెయ్ డార్లింగ్..." సీతాపతి మాటలకి అడ్డొస్తూ మళ్ళీ అంది కోమలి.

ఆమె సుందరమైన ఛాతీని అతని గుండెకు అన్చింది. శృంగారం మరింతగా వొలకబోసింది.

కోమలి స్పర్శకు మరింతగా పులకించిపోతూ "డోన్ట్‌వేస్ట్ మై ప్రషస్ టైం!... హూ ఆర్ యు... వాట్ డు యూ వాంట్?..." స్వరం రెట్టించి ప్రశ్నించాడు, సీతాపతి.

"డా...డీ!..." అంటూ ఫోన్లో అవతలి వ్యక్తి పిలిచిన పిలుపుకి అదరిపడ్డాడు సీతాపతి.

"వాట్!?-డాడీ!?...డోన్టాక్ రబ్బిష్... ఏం? బ్లాక్‌మెయిల్ చేద్దామనుకుంటున్నావా...లేకపోతే నువ్వు ఓ పిచ్చివాడివైనా అయివుండాలి...ముందు ఫోన్ పెట్టేయ్..." కోపం జేవురించింది సీతాపతి ముఖంలో.

"ఏమిటీ... నన్ను కల్సుకునేటందుకు నీకు అవకాశంకావాలా...? నాన్సెన్స్!... ఎందుకు?..."

"మీరు నా తండ్రి అని రుజువు చేసేటందుకు..."

"వాట్ డు యూ టాక్!...నాకసలు పెళ్ళే అవలేదు. నేను ఆజన్మ బ్రహ్మచారిని!! అలాంటి నన్ను పట్టుకుని డెలిబరేట్‌గా డాడీ అంటావా?... నీకెంత ధైర్యం. నా స్టేటస్ తెలీకుండా అనవసరంగా వాక్కు! తల్చుకుంటే నిన్ను జైల్లో తోయించెయ్‌గల్ను! అండర్‌స్టాండ్!...పెట్టేయ్!...ముందు రిసీవర్ పెట్టెయ్..." ఆవేశంగా మాట్లాడేడు సీతాపతి. తాను మాత్రం రిసీవర్ పెట్టేటందుకు ప్రయత్నించలేదు.

"డియర్... కోపం తెచ్చుకోకు...మన మూడ్స్ పాడైపోతాయ్!!!..." తానే సీతాపతి చేతిలో రిసీవర్ లాక్కుని హుక్ మీద పెట్టేసింది కోమలి.

అన్యమనస్కంగా వుండిపోయాడు సీతాపతి.

★★ ★★ ★★

టెలిఫోన్ అదేపనిగా రింగ్ అవుతోంది!

డైరెక్టర్ పశుపతి ఎ.సి.రూమ్లోంచి బైటికొచ్చింది కోమలి. డిక్టేషన్ తీసుకున్న షార్ట్‌హాండ్ బుక్ టేబిలు మీదుంచి రిసీవర్ అందుకుంది సీట్లో కూర్చుంటూ.

"యస్! పతి అండ్ పతి కాటన్ మిల్స్ ప్లీజ్!!.. ఎవరుకావాలి? ఐయామ్ పర్సనల్ సెక్రటరీ స్పీకింగ్... వెరీ గుడ్ మార్నింగ్..."

"నా పేరు గోవిందరావు..." అవతలి కంఠం జవాబిచ్చింది.

"వాట్ ఎ స్వీట్ నేమ్!... ఆ...వున్నారు. వారితో మీకేంపని?"

'నేను వారి అబ్బాయిని!..."

క్షణంసేపు ఆశ్చర్యపోయింది కోమలి.

వెంటనే తెప్పరిల్లుకుని "వాట్ ఎ వండర్?! డైరెక్టర్ గారికి ఒక్కరేసన్! ఆయన స్టేటస్‌లో వున్నారిప్పుడు!!..."

"నా గురించిన వివరాలు మీకనవసరం!...దయచేసి పశుపతిగారికి కన్నెక్ట్ చెయ్యండి. వారితో పనుంది..."

"ఏ విషయం?..."

"దటీజ్ మై పర్సనల్!"

క్రితంరోజు రాత్రి సీతాపతిగారి బంగాళాలో తాను వున్నప్పుడు ఇదేవ్యక్తి ఫోన్ చేసిన విషయం గుర్తొచ్చింది కోమలికి.

"ప్లీజ్ కన్నెక్ట్ మీ టు పశుపతి..." గోవిందరావు అభ్యర్థనకు ఆలోచననుండి తెప్పరిల్లుకుంది కోమలి.

"ఆల్‌రైట్!... యుకెన్ స్పీక్ టు ది డైరెక్టర్..." అంటూ బజరిచ్చి రిసీవర్ పెట్టేసింది.

రివాల్వింగ్ చైర్లో జాలీగా అటు ఇటు వూగుతున్న పశుపతి రిసీవర్ అందుకున్నాడు.

"పశుపతిగారా?...నమస్కారం!" గోవిందరావు గౌరవసూచకంగా మాట్లాడేడు.

"యస్...వాట్ డు యూ వాంట్?"

"మీతో నాకు పర్సనల్ ఇంటర్వ్యూ కావాలి..."

"ఎవరు మీరు?... ఏదైనా బిజినెస్ విషయం గురించా?"

"నో! ప్యూర్లీ పర్సనల్..."

"అసలు మీరెవరు? మీ స్టేటస్ ఏమిటి?..."

"ఆ వివరాలు తర్వాత చెప్తాను. ముందు మీరు నాకో ప్రామిస్ చెయ్యాలి..."

"డోన్టాక్!...ఫోన్ పెట్టెయ్యండి..."

"ప్లీజ్...నా మాట విన్పించుకోండి..."

"ఆల్‌రైట్...టెల్‌మి!"

"మీ కంపెనీలో నాకు వుద్యోగం కావాలి."

''కావాలనుకుంటే దొరకటానికి వుద్యోగం బార్లో విస్కీ అనుకున్నావా?''

''నేను బాగా చదువుకున్నవాడిని...''

''ఏమిటి నీ క్వాలిఫికేషన్?''

''బి.ఏ! ఫస్ట్‌క్లాస్!!''

''అంతేనా?! ఈ మాత్రానికే నీకు వుద్యోగం వస్తుందనుకోవటం కేవలం నీ భ్రమ! నా ఫ్యాక్టరీలో నైట్‌వాచ్‌మెన్ క్వాలిఫికేషన్ ఏమిటో నీకు తెలుసా?... ఎం.ఏ!''

''మీతో వాదించను! నాకు వెంటనే జాబ్ కావాలి! ఇస్తారా... ఇవ్వరా?''

''వాట్ ఎ మేన్ యువార్!? మా ఆఫీసుగేటుకి వ్రేలాడే నోవేకెన్సీ బోర్డు చూడలేదా నువ్వు? కాబట్టి ఫోన్ పెట్టెయ్. డోన్ట్ వేస్ట్ మై టైమ్...'' చిరాకు పడ్డాడు పశుపతి.

''మీ విలాసాలకు వెచ్చించే టైంలో నూరోవంతు నావంటివాడితో మాట్లాడటానికే మీకు బాధవ్విస్తోంది...అవునా?''

''డోన్టాక్ రబ్బిష్!- ఆర్ యు మ్యాడ్?''.

''మిమ్మల్ని కలుసుకోవాలని వుంది...''

''ఓ మై గాడ్!...వాటే బ్లడీ హెల్?...అసలింతకూ నువ్వెవరు?...'' స్వరం రెట్టించి అడిగేడు పశుపతి.

''స్వీట్ డాడీ... ఐయామ్ యువర్ సన్!''

పశుపతికి ఆ మాట వినగానే మతిబోయినట్టయింది. తనకొడుకే నిజంగా ఫోన్లో తమాషా చేస్తున్నాడా?...నో! ఇంపాజిబుల్... ఇది భార్గవ్ కంఠస్వరంకాదు. పైగా భార్గవ్ విదేశాల్లో వున్నాడు.

''డోన్ట్ బ్లాక్‌మెయిల్ మీ!... యు ఆర్ ఎ ఛీట్...'' కోపంతో వూగిపోతూ రిసీవర్ హుక్‌మీద విసురుగా పెట్టేశాడు.

ఎవరీ గోవిందరావు...ఎవరై వుంటాడు...తనకెందుకు ఫోన్చేసినట్టు...వూహకు అందని సమస్యలతో సతమతమవుతూ తలపట్టుకున్నాడు పశుపతి.

★★ ★★ ★★

అప్పుడే డ్యూటీకొచ్చి సీట్లో కూర్చుంది కోమలి! టెలిఫోన్ రింగవుతోంది. విసుగు ప్రదర్శించకుండా రిసీవర్ అందుకుని 'హలో...' అంది మృదుమధురమైన కంఠంతో. అది ఆమె డ్యూటీ!

''గోవిందరావ్ హియర్!... మీ బాస్ ఛాంబర్లో వున్నారా?''

ఈసారి కోమలి విస్తుపోలేదు. అతని స్వరాన్ని గుర్తించగలిగింది వెంటనే! కాబూలీవాడు గుర్తొచ్చేడామెకి!! ''మీకు ఏ బాస్ కావాలి?! మా కంపెనీకి మొత్తం ముగ్గురు డైరెక్టర్లు...'' ఎదురు ప్రశ్నవేసింది.

''పంపాపతిగారు...బాస్ నెంబర్ త్రీ!''

''వారితో మీకేంపని?''

''ఆ వివరాలన్నీ అడగద్దు-కన్నెక్ట్ హిమ్! దట్సాల్...''

''నిన్ననేగదా మీరు రెండో బాస్‌తో మాట్లాడింది?...''

''ఆయన నిన్న ఈవినింగ్ ఫ్లైట్లో బొంబాయి వుడాయించారుగదా!...అందుకే ఐ వాంట్ మిస్టర్ పంపాపతినే!!''

''సారీసార్!...బాస్ పర్మిషన్ అడిగి కనెక్షన్ ఇస్తాను...''

''చూడండీ! మీరు మిస్సో...మిసెస్సో నాకు తెలీదు. కానీ...వుద్యోగంలో కొత్తగా చేరివుంటారని మాత్రం వూహించగలను...అవునా?''

''ఆ డిటేల్స్ అన్నీ మీకనవసరం.'' చిరాకు పడ్డది కోమలి.

''నో...నో...నో! అంత తేలిగ్గా కొట్టిపారేయకండి! మీరు చేస్తున్న వుద్యోగం ఏ ఆడదీ పట్టుమని ఒక సంవత్సరాకాలమైనా చెయ్యక వెళ్లిపోయేవారు కదూ?''

'ఏమిటీ అసందర్భపు ప్రేలాపన!' అనుకుంది.

''మీ బోర్ భరించటం చాలా కష్టం! బాస్‌కి కన్నెక్ట్‌చేస్తాను. మాట్లాడండి...'' బజరిచ్చి రిసీవర్ పెట్టేసింది. కర్చీఫ్‌తో సుతారంగా ముఖాన్ని అద్దుకుంది.

''హలో...పంపాపతి హియర్...'' హుందాతనం ఉట్టిపడ్డది. సగం నెరిసిన బట్టతల, పసుపు శరీరచ్ఛాయ, గోల్డుఫ్రేమ్ కళ్ళజోడు, మనిషి తెల్లటిగుడ్డల్లో ధగధగ మెరిసిపోతున్నాడు వయస్సు యాభైదాటినా.

'నేనెవరో మీకు తెలియదు. కానీ...మీరు నాకు తెల్సు!''

''ఐసీ! ఇంతకూ మీరెవరూ?'' భృకుటి ముడిపడ్డది పంపాపతికి.

'నేనెవరనో చెప్తే ఆశ్చర్యపోతారు. నో నో మీ గుండె ఆగిపోవచ్చు...''

కాస్త తత్తరపడ్డాడు పంపాపతి. అంతలోనే సంబాళించుకుని '' ఎందుకని అలా అంటున్నారు?... మీరేమైన మా కస్టమరా?... వ్యాపారంలో ఏదైనా లాసొచ్చిందా??...'' అడిగేడు తొట్రుపాటుతో.

''అదేంకాదు. నే చేప్పే నిజాన్ని మీరు అంగీకరించరుగనుక!...''

''వాట్ ఎ వండర్...'' గలగలా నవ్వేడు, పంపాపతి.

''అవును. వండరే! వట్టి వండర్ కాదు... వరల్డులో బహుశా ఎయిత్ వండర్ అయివుంటుంది...''

''ఈజిట్ సో!? దెన్ టెల్మి...వాట్ డూయు వాంట్''

''అడిగింది ఇస్తారా?''

''బహుశ మీరడగబోయేది... ఏ సత్కార్యానికో డొనేషన్ ఐవుంటుంది...''

''డబ్బు విషయం అయివుంటుందని చక్కగా అంచనా వేశారు. సరిగ్గా మీ ఆలోచనే నాలోనూ వుంది! ఎంతైనా మీ కొడుకునికదా!...''

షాక్ తిన్నవాడిలా కొయ్యబారిపోయాడు క్షణంపాటు పంపాపతి! తన చెవులను తనే నమ్మలేకపోయాడు.

'' ఏమిటి నువ్వంటున్నది?...'' తడబడుతూ అడిగేడు.

''ఐ యామ్ యువర్ సన్! ఐ వాంట్ లయన్ షేర్ ఫ్రం యువర్ ప్రాపర్టీ...''

''షటప్! బ్లాక్‌మెయిల్ చెయ్యాలని ప్రయత్నించకు...నాకు ముగ్గురూ ఆడపిల్లలే! అసలు నువ్వు ఎవరు... ఎందుకిలా ఫోన్ చేస్తున్నావ్?'' కోపం తారాస్థాయి చేరుకుంది.

''సమాజంలో మీకున్న స్టేటస్...నన్ను మీ బిడ్డగా అంగీకరించేటందుకు ఒప్పుకోదు. అవునా? మీరు తీపిగతాన్ని మర్చిపోయి వుండొచ్చు. కానీ...నా తండ్రి ఎవరో తెల్సుకోగలిగేటందుకు నాకు పాతికేళ్ళు పట్టింది...''

పంపాపతికి నోరు పెగల్లేదు.

''ఫోన్లో ఎక్కువ మాట్లాడటం సభ్యతకాదు. రేపు నైట్ మిమ్మల్ని మీ గెస్ట్‌హౌస్‌లో కలుస్తాను. డబ్బుతో రెడీగా వుండండి! ఐ వాంట్ వన్ లాక్ రుపీస్...విషయాలను వివరంగా అప్పుడు చెప్తాను ఫాదర్!...''

''హ...హలో...హలో...అరే రిసీవర్ పెట్టేశాడే...'' అచేతనంగా పంపాపతి కూడా రిసీవర్ హుక్ మీద ఉంచాడు...

బజర్ నొక్కి బాయ్‌ని పిలిచేడు. ఫ్రిజ్ వాటర్ ఓ గ్లాసు తెమ్మని ఆర్డరిచ్చాడు. తల రెండుచేతులతో పట్టుకూర్చుండిపోయాడు.

★★ ★★ ★★

ముగ్గురు బ్రదర్స్ గెస్ట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ముగ్గురిలోనూ బర్నింగ్ ప్రాబ్లముంది. మనసుల్లో ఆందోళనుంది. అయినా తనంతట తానుగా ఏ ఒక్కరూ బైటపడదల్చుకోలేదు.

ఖరీదైన కార్పెట్ల మధ్యగా నాలుగుసోఫాలు...వాటిమధ్య పెద్ద టీపాయ్ ఉంది.

ఆ రూమ్‌లో గోడలకు అందమైన స్త్రీల అర్ధనగ్న చిత్రాలు...ఘుమః ఘుమలాడుతున్న సెంటు వాసన!

ఇంపోర్టెడ్ విస్కీతో నిండిన గ్లాసులు వారిముందున్నాయ్. ఒక్కసారిగా వారి మూడు కుడిచేతులు గాలిలోకి లేచాయి.

ఛీర్స్ చెప్పుకున్నారు! సిప్పు లాగించేరు!! వుండివుండి...వారి ఆరుకళ్ళు మెయిన్ డోరు కేసి చూస్తున్నాయ్. మళ్ళీ ఒకరిముఖాలు మరొకరు చూచుకుంటూ సిప్‌మీద సిప్ లాగిస్తున్నారు. వారిముందున్న ప్లేట్లో పదార్థాలు కరకరా నములుతున్నారు.

సుఖంకోసం తాగటంలేదు; వాళ్లని పట్టి పీడిస్తున్న వర్రీని మర్చిపోయేటందుకు తెల్లగుర్రాలెక్కారు.

''బ్రదర్స్! మీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను...'' మూడైదుల సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు సీతాపతి.

''నువ్వాగు సీతాపతీ!...నన్ను చెప్పనీ...తమ్ముడూ పంపా!...నన్నొక సమస్య వేధిస్తోంది...'' అన్నను వారిస్తూ పశుపతి విషయం చెప్పేటందుకు సిద్ధపడ్డాడు.

''ప్లీజ్‌వెయిట్!...నా ప్రాబ్లమ్ వింటే మీరిద్దరూ ఆశ్చర్యపోతారు...'' గ్లాసులో మిగిలిన మందుగొంతులో పోసుకుని తడబడుతూ అన్నాడు పంపాపతి.

ఒకరి ముఖాలొకరు సీరియస్‌గా డిమ్‌లైటు వెలుగులో మళ్ళీ ఒకసారి చూచుకున్నారు. అప్పటికి ఫుల్ బాటిల్ అయిపోవచ్చింది. ఊదేసిన సిగరెట్ పీకల్తో యాష్‌ట్రే నిండిపోయింది.

''ఎవడో మనల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు...'' ముగ్గురూ ఒక్కసారిగా అరిచినట్లు మాట్లాడేరు.

''ఫెంటాస్టిక్ డియర్ ఫాదర్స్! మీ అందరికీ నా వినయపూర్వక నమస్కారాలు...'' ఠక్కున ప్రత్యక్షమైన గోవిందరావ్ కేసి ముగ్గురూ విస్తుపోయి చూచారు.

చలనంలేని శిలాప్రతిమల్లా వుండిపోయారు లిప్తపాటు.

''ముగుర్నీ ఒకేచోట చూడగలగటం నా అదృష్టంగా భావిస్తున్నాను...''

"షటప్!..." ముగురూ ఒకేసారి గావుకేకొపెట్టేరు.

"ఆవేశపడకండి. ఐ యామ్ యువర్ సన్. నా మాట మీరు నమ్మాలి..." దగ్గరగా వచ్చాడు గోవిందరావు.

పళ్ళు పటపట కొరికేరు. లేవబోయి తూలి మళ్ళీ సోఫాల్లో కూర్చుండిపోయారు.

"డోన్ట్ బీవైల్డ్! ఐ యామ్ యాన్ యాంగ్రీ యంగ్‌మాన్! మీ కళ్ళు అప్పుడు... ఇప్పుడు... ఎప్పుడూ మూతలు పడిపోతూనే ఉన్నాయ్. మీరు చేసిన చీకటి తప్పుకు ప్రతిరూపాన్నే నేను..." ఆవేశంగా మాట్లాడబోయాడు, గోవిందరావు.

"వెధవ ప్రేలాపన ఆపు!... మేం తల్చుకుంటే నిన్ను వున్నఫళంగా కటకటాల వెనక్కి తోసేయించ గలం. లేకుంటే పీక పిసికి చంపేసి కేసు లేకుండా తప్పించుకోగలం..."

"మీ మెంటాలిటీ ఏమిటో మరోసారి రుజువు చేసుకున్నారు. మీ చేతులు కూడా ఎంత కఠినంగా ఉంటాయో మా అమ్మ చెప్పింది అక్షరాల నిజం..."

"ఎవరు మీ అమ్మ?..." ముగ్గురూ ఏక్మై ప్రశ్నించారు. ఏం చెప్తాడాని ఆత్రంగా గోవిందరావు ముఖంలోకి తదేకంగా చూడసాగేరు.

"మీ కంపెనీలో పాతికేళ్ళ క్రితం మా అమ్మ మీ పర్సనల్ సెక్రటరీ వుద్యోగానికి కుదిరింది. పేరు శకుంతల. మీకామె గుర్తుండాల్సిన అవసరంలేదు. ఇదే గెస్ట్ హౌస్‌లో నా తల్లిని ముగ్గురూ కల్సి బలవంతంగా, రాక్షసంగా అనుభవించేరు. అభిమానాన్నీ, మానాన్నీ పోగొట్టుకున్న నా తల్లి ఆత్మహత్య చేసుకునేటంత బలహీనురాలు కాదు. ఉద్యోగంలోంచి మీరు తీసేసినా, కడుపులోవున్న నన్ను బ్రతికించికోవాలనే ఆరాటంతో నాకు జన్మ ప్రసాదించి... పెంచి...పెద్దచేసి...చదివించి... ఇంతటివాడిని చేసింది..."

ముగ్గురి ముఖల్లో నెత్తుటిబొట్టు కర్వైంది. ముద్దాయిల్లాగా తలొంచుకు వుండిపోయారు.

"మీ ముగ్గురూ నా తల్లికి అన్యాయం చేసినా... ఆమె మానాన్ని దోచుకున్నా...నన్నుమాత్రం అన్యాయం చెయ్యటానికి ఆమెకు మనస్కరించలేదు. నా జన్మకు కారకులు మీ ముగ్గురూ అనే నిజాన్ని ఇటీవలే తెల్సుకున్నాను. అందుకే మిమ్మల్ని వెంటాడేను...చివరకి కల్సుకున్నాను."

ముగ్గురిలో ఏ ఒక్కరూ నోరు మెదపలేకపోయారు.

'' ఈ పవిత్ర భారతదేశంలో... ఏ బిడ్డకైనా తండ్రి ఒక్కడే! కానీ... నా విషయంలో చరిత్ర తల్లక్రిందులైంది... అందుకు నాకే సిగ్గుగా వుంది... కానీ... నేకోరేది ఒక్కటే!... నాకు 'తండ్రి' మీ ముగ్గురూ అనేసి వప్పుకుంటే చాలు. ఇలాంటి ఘోరకిరాతకం ఏ మగాడూ ఏ ఆడదానికీ చెయ్యకూడదు... దట్సాల్... దట్సాల్!...'' గోవిందరావు కంఠం జీరపోయింది.

అశ్రుపూరిత నయనాలతో అడుగులో అడుగేసుకుంటూ వచ్చినదారినే వెళ్ళిపోయాడు. చీకటిలో అదృశ్యమయ్యేడతను!.

---

★ (23-7-87 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రికలో ప్రచురితం)

ఫోన నెం. 4051263

ఆకర్షణీయమైన వడ్డీరేట్లు! - లాకర్స్ సదుపాయం కలదు!

ఈ బ్యాంక్ మీది మాది మనందరిది.

మరిన్ని వివరాలకై వెంటనే సంప్రదించండి.

**శ్రీనివాసా పద్మావతీ**

**కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్**

ప్లాట్ నెం.15, రోడ్ నెం.2, శ్రీవేంకటేశ్వర కాలనీ,

సరూర్‌నగర్, హైదరాబాద్-35.